క్లుప్తంగా

ఆర్డీఓకు సత్కారం



గుడివాడ టౌన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న గుడివాడ ఆర్డీఓ జి. బాల సుబ్రహ్మణ్యంను గుడివాడ మున్సిపల్ షాప్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నవోదయ శ్రీనివాస్, సభ్యులు సయ్యద్ గఫార్, కొత్తా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాల గ్రహీతలకు అభినందన



గుడ్లవల్లేరు: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని కలెక్టర్ బాలాజీ నుంచి ఉత్తమ పురస్కారాన్ని అందుకున్న గుడ్లవల్లేరు డివిజన్ వెటర్నరీ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.జగన్నాథ రావు, వీఎల్ఓ ఎస్.ప్రభాకరరావు, సీనియర్ అసిస్టెంట్ కె.వెంకటేశ్వరరావుకు సోమవారం పలువురు అభినందనలు తెలిపారు. వెటర్నరీ ఉప సంచాలకులు డాక్టర్ సి.శ్రీనివాస్, సహాయ సంచాలకులు డాక్టర్ ఎ.లక్ష్మీనారాయణ, పశు వైద్యుడు డాక్టర్ హనుమంతరావు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



తోట్లవల్లూరు: ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మూడే శివశంకరరావు సూచించారు. మండలంలోని బొడ్డపాడులో ఉపాధిహామీ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ సీతారాంబాబు, ఉప సర్పంచ్ కే. శివశంకర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడిగా సాయిరాం



పామర్రు: మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా ఘంటసాల త్రివిక్రమ సాయిరాంను సోమవారం ఎంపిక చేశారు. గతంలో అధ్యక్షుడిగా ఉన్న మంచి కంటి వెంకటేశ్వరరావు ఇతర దేశాలకు వెళ్లి, అక్కడే స్థిరపడటంతో ఆయన స్థానంలో త్రివిక్రమసాయిరాంను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు ఎస్.నాగసాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరిగింది. సాయిరాంను పలువురు ఆ సంఘ నాయకులు అభినందించారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



జమీదగ్గుమిల్లి(పామర్రు): పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జమీదగ్గుమిల్లి పశువైద్యులు డాక్టర్ రామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని జమీదగ్గుమిల్లి పశువైద్యశాల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దూడలకు పాముల మందు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ బ్రహ్మం, యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ సాయివర్ధన్, వంశీకుమార్ పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: ఉచిత వైద్య శిబిరాలను పశుపోషకులు ఉపయోగించుకోవాలని పశుసంవర్ధక శాఖ డాక్టర్లు రామకృష్ణ, ప్రదీప్, సూర్యకుమారి అన్నారు. మండలంలోని అల్లినగరం, కొవ్వాడలంకలో సోమవారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. పశువులు వ్యాధుల బారిన పడకుండా టీకాలు, మందులు వాడాలని పశుపోషకులకు సూచించారు.

ఆర్టీసీ వాకర్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



గుడివాడ టౌన్: గుడివాడ ఆర్టీసీ కాలనీ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. క్లబ్ అధ్యక్షుడిగా ఎల్. జానకీరామ్ ప్రసాద్, కార్యదర్శిగా సీహెచ్. రామ్మోహన్, కోశాధికారిగా ఎం.నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా ఎల్.బాబ్జి, చిట్టిబాబు, గుత్తా చంటి, బి. కుటుంబరావు, కె. రవికుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరాన్ని అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య ప్రారంభించారు. 190 మందికి ఉచిత ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించారు.

యూరియా కట్టకట

- మొక్కజొన్న సాగుతో పెరిగిన డిమాండ్
- సొసైటీలకు మొక్కుబడిగా సరఫరా
- రైతులకు తప్పని ఇబ్బందులు

తోట్లవల్లూరు: రైతులను యూరియా కొరత వేధిస్తోంది. వ్యవసాయ అవసరాలకు తగినట్లుగా యూరియా సరఫరా ఉండకపోవటంతో పంటల సాగు ఎలా అర్థంకాక రైతులు సతమతమవుతున్నారు. తోట్లవల్లూరు మండలంలోని పలు గ్రామాల రైతులు యూరియా కొరతను ఎదుర్కొంటున్నారు. సొసైటీల్లో యూరియా నిల్వలు తగినంత లేకపోవడం, డిమాండ్ అధికంగా ఉండటంతో వ్యాపారులు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. చేసేదేమీ లేక వ్యాపారులు చెప్పిన ధరకే రైతులు యూరియా కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఇటీవల సంభవించిన కృష్ణానది వరదల కారణంగా కరకట్ట వెంబడి ఉన్న రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, పాములలంక, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, దేవరపల్లి, గురివిందపల్లి, ఐలూరు తదితర గ్రామాల పరిధిలోని లంకల్లో పసుపు, కంద, అరటి, కూరగాయలు, బొప్పాయి, పూల తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరదతో దెబ్బతిన్న పంటల స్థానంలో రైతులు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు చేపట్టారు.



వల్లూరుపాలెం సొసైటీ వద్ద యూరియా కోసం రైతుల పడిగాపులు



యూరియా బస్తా

జోరుగా అమ్మకాలు..

రైతులు ఏకకాలంలో సుమారు నాలుగు వేల ఎకరాలకుపైగా మొక్కజొన్న సాగు చేస్తుండటంతో యూరియాకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. కాంప్లెక్సు ఎరువుల ధరలు మండుతుండటంతో తక్కువ ధరలో వచ్చే యూరియా వినియోగానికే రైతులు మొగ్గు చూపుతున్నారు. దీంతో గత కొన్ని రోజులుగా యూరియా కొరత ఏర్పడింది. కరకట్ట వెంబడి గ్రామాల్లోని పీఏసీఎస్‌లలో యూరియా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. యూరియా కొరత నేపథ్యంలో సొసైటీలకు వచ్చిన స్టాకు వచ్చినట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోతోంది. బహిరంగ మార్కెట్‌లో యూరియా ధర అధికం కావటంతో రైతులు యూరియా కోసం ఎక్కువగా సొసైటీలనే ఆశ్రయిస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువుల కట్ట ధర రూ.1,300 వరకు ఉంటోంది. అదే యూరియా కట్ట ధర సొసైటీల్లో రూ.265 మాత్రమే. రైతుల డిమాండ్‌ను అడ్డుపెట్టుకుని ఎరువుల వ్యాపారులు రూ.330 నుంచి రూ.350 వరకు రైతుల నుంచి వసూలు చేస్తున్నారు.

సొసైటీల్లో ఉంచాలి

వ్యవసాయ అవసరాలకు తగినంతగా యూరియా దొరకటం లేదు. వల్లూరుపాలెం సొసైటీలో ఐదు రోజులుగా యూరియా అందుబాటులో లేకపోవటంతో తోట్లవల్లూరు సొసైటీకి వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చింది. సొసైటీల్లో యూరియాను అందుబాటులో ఉంచాలి.

– బడుగు శంకర్, రైతు, వల్లూరుపాలెం

డిమాండ్ పెరిగింది

మొక్కజొన్న సాగుతో యూరియాకు డిమాండ్ పెరిగిన మాట వాస్తవమే. అయితే రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియాను దిగుమతి చేసుకుంటున్నాం. రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా సరఫరా చేస్తున్నాం.

– వి.దయాకర్, సీఈఓ, నార్తువల్లూరు పీఏసీఎస్

సమాజానికి దిశానిర్దేశం 'ఆముక్తమాల్యద'

గుడివాడ టౌన్: శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద గ్రంథం సమాజానికి దశ, దిశ నిర్దేశంలాంటిదని విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాల అధ్యాపకులు డాక్టర్ సత్య శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎన్టీఓస్ హోమ్‌లో సోమవారం ఆముక్తమాల్యద-సాహితీ విలువలు అనే అంశంపై ఆయన ప్రసంగించారు. శ్రీకృష్ణదేవరాయలు పాలనలో సాహిత్యానికి అజేయుడుగా నిలిచి విజయనగర సామ్రాజ్యాన్ని విస్తరించడంతో పాటు సాహిత్యానికి పెద్దపీట వేశారన్నారు. అనంతరం సత్య శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు భారతి సమితి అధ్యక్ష కార్యదర్శులు డీఆర్‌బీ ప్రసాద్, ఎం.మాధవరావు, సభ్యులు కె.కృష్ణమోహన్, జి.రాజేంద్రప్రసాదు, చిరంజీవిరావు, కేఎస్ అప్పారావు, వంశి, వెంకటేశ్వరరావు, గాంధిబాబు తదితరులు పాల్గొన్నారు.



సత్య శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న భారతి సమితి సభ్యులు

'స్పందన'కు నాలుగు దరఖాస్తులు

గుడివాడ టౌన్: స్పందన కార్యక్రమంలో నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. స్థానిక నాగవరప్పాడు బీసీ హాస్టల్ వెనుక రోడ్‌లో మంచినీటి పైప్ లైన్‌లో మురుగునీరు కలుస్తుందని, నాగవరప్పాడులో రోడ్డులో ఆక్రమణలు అధికంగా ఉన్నాయని వాటిని తొలగించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరినట్లు ఆయన తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో మూడు అర్జీలు అందినట్లు తహసీల్దార్ కే మస్తాన్ తెలిపారు. ఈఓపీఆర్‌డీ ఎంఎస్‌కే పరమాత్మ, ఏఓ కే శివప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

మాంటిస్సోరి విద్యార్థినుల ప్రతిభ



గుడివాడ టౌన్: జాతీయ ఓటర్స్ డేను పురస్కరించుకుని కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం మచిలీపట్నంలో నిర్వహించిన వివిధ పోటీల్లో తమ విద్యార్థినులు ప్రతిభను ప్రదర్శించి బహుమతులు సాధించారని మాంటిస్సోరి పాఠశాల హెచ్ఎం జి.పద్మావతి సోమవారం తెలిపారు. లఘునాటకంలో బి.శ్రీనితిక బృందం ప్రథమ స్థానం, చిత్రలేఖనంలో జి.పార్థీవని జానకి తృతీయ స్థానం, పాటల విభాగంలో వైశాలి తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. విజేతలకు జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఈఓ రామారావులు బహుమతులు అందజేశారన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గుడివాడరూరల్: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ హెచ్చరించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులను ఆపి సోమవారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలను సైలెన్సర్ తీసేసి శబ్దాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న వారికి జరిమానా విధించినట్లు తెలిపారు.

సోలార్‌పై నేడు అవగాహన

గుడ్లవల్లేరు: సోలార్ విద్యుత్ వలన కలిగే ఉపయోగాలపై సింగలూరు గ్రామస్తులకు మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.వి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు పీఎం సూర్య ఘర్‌పై అవగాహనను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ **అధ్యాపకులకు ఉత్తమ అవార్డులు**



కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అవార్డులు పొందిన అధ్యాపకులను సత్కరిస్తున్న దృశ్యం

కైకలూరు: వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఇద్దరు అధ్యాపకులకు జిల్లా ఉత్తమ అవార్డులు దక్కాయి. గణతంత్ర దినోత్సవం రోజున వీరు కలెక్టర్ల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను ఆదివారం అందుకున్నారు. అవార్డు గ్రహీతలను కాలేజీలో ప్రిన్సిపాల్ వై.శ్రీలత సోమవారం అభినందించారు. రసాయనశాస్త్ర అధ్యాపకుడు ఆర్.జాలాబాబు ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు అందుకున్నారు. చరిత్ర అధ్యాపకుడు ఎం.హరిప్రసాద్ దసరా మహోత్సవాల్లో, విజయవాడ వరద బాధితులకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కలిసి సేవలందించినందుకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ నుంచి ప్రశంసాపత్రం పొందారు. అవార్డు గ్రహీతలను వైస్ ప్రిన్సిపాల్ డి.ఉదయప్రకాష్, అధ్యాపకులు సన్మానించారు.

■ **నవీన ఫార్మసీ రంగంలో రాణించాలి**



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ సాంబశివరావు

గుడ్లవల్లేరు: నవీన ఫార్మసీ రంగంలో రాణించాలని మధ్యప్రదేశ్‌కు చెందిన జబల్‌పూర్ మాంగల్యతాన్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కె.ఆర్.ఎస్.సాంబశివరావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీలో సోమవారం బయోటెక్నాలజీ బ్రేక్ త్రూస్ రీడిఫైనింగ్ ఫార్మసీ త్రూ కటింగ్ ఎడ్జ్ రీసెర్చ్ అనే అంశంపై జాతీయ సదస్సును ప్రారంభించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

■ **అనుమతులు లేని మందులు విక్రయిస్తే చర్యలు**



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ

గుడివాడరూరల్: అనుమతులు లేని ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఏడీఏ రమాదేవి అన్నారు. పట్టణం, రూరల్ ప్రాంతాల్లో ఉన్న ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఏఓ అనంతలక్ష్మితో కలసి సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఆయా షాపుల రికార్డులు పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ అధిక రేట్లకు ఎరువులు విక్రయించినా దుకాణాలు సీజ్ చేస్తామన్నారు.

■ **అధిక పాలదిగుబడి సాధించండి**



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు

పమిడిముక్కల: మేలు జాతి పశువుల పెంపకం ద్వారా అధిక పాల దిగుబడి సాధించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ డీడీ శ్రీనివాస్ రైతులకు సూచించారు. వ్యవసాయంతో పాటు పశుపోషణపై కూడా దృష్టి పెట్టాలన్నారు. మేడూరులో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని డీడీ శ్రీనివాస్, సర్పంచ్ గొర్రెపూడి స్వర్ణలత ప్రారంభించారు. ఈ సందర్భంగా దూడల అందాల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన దూడల యజమానులు మురళీకృష్ణ, మల్లికార్జున, గోపీకి బహుమతులు అందజేశారు.

■ **ప్రకృతి విధానంలో సాగు చేసిన కూరగాయల విక్రయం**

ముదినేపల్లి రూరల్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసి పండించిన కూరగాయలను సోమవారం విక్రయించారు. మండలంలోని బొమ్మినంపాడు, కొరగుంటపాలెంలో ప్రకృతి వ్యవసాయంలో కూరలు పండిస్తున్నారు. ప్రతి సోమవారం ముదినేపల్లిలో నిర్వహించే వారపు సంతలో ఈ కూరగాయలను మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో విక్రయిస్తున్నారు.

■ **సమస్యలు పరిష్కరించాలని వినతి**



పెదపూడిలో నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

పెదపూడి(మొవ్వ): మొవ్వ మండలం పెదపూడి పీఎంఏవై ఎన్టీఆర్ నగర్ (జగనన్న కాలనీ)లో సమస్యలు పరిష్కారం చేయాలంటూ కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్లో సోమవారం జరిగే మీ కోసంలో వినతి పత్రాలను అందించారు. కార్యక్రమంలో తోట సాంబశివరావు, వెంకటరమణ, రంగబాబు, షరీఫ్, వెంకట్ నాంచారయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

■ **దళిత ప్రజాసమితి అధ్యక్షుడిగా 'తలారి'**

ముదినేపల్లి రూరల్ : దళిత ప్రజాసమితి మండల శాఖ అధ్యక్షుడిగా తలారి రంగారావు సోమవారం నియమితులయ్యారు. ఈ మేరకు సమితి వ్యవస్థాపకుడు కాపుదాసి రవికుమార్ ముదినేపల్లిలో నియామకపత్రాలు అందజేశారు.

■ **బాల్య వివాహాలను గమనిస్తే టీచర్లకు చెప్పండి**

కైకలూరు: సమాజంలో బాల్య వివాహాలను గుర్తిస్తే టీచర్లకు చెప్పాలని విద్యార్థులకు కైకలూరు కోర్టు ప్యానెల్ అడ్వొకేట్స్ పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్ సూచించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మాత ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రధానంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై వివరణాత్మకంగా తెలిపారు. ఇటీవల 10వ తరగతి విద్యార్థులు కొందరు ద్విచక్ర వాహనాలు నడుపుతున్నారని, లైసెన్సులు లేకపోతే పోలీసులు కేసులు నమోదు చేస్తారని పేర్కొన్నారు. ముందుగా లింగ నిర్ధారణ చేయడం చట్ట రీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం సీబీ.థామస్, పారా లీగల్ వలంటీర్ రాంబాబు పాల్గొన్నారు.

ఉల్లాస వలంటీర్లకు శిక్షణ



పామర్రు: గ్రామీణ ప్రాంతాల్లోని వయోజనులకు విద్యను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉల్లాస వలంటీర్లను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిక చేసిన ఉల్లాస వలంటీర్లకు ఒక్కరోజు శిక్షణ తరగతులను సోమవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎంపిక చేసిన వయోజనులకు ఈ వలంటీర్లు చదువు నేర్పించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ తరగతుల అనంతరం వలంటీర్లకు కరదీపికలను అందజేశారన్నారు. ఎంపీడీఓ జ్యోతి పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

ముదినేపల్లి రూరల్ : భూముల రీసర్వేలో భాగంగా మండలంలోని చినకామనపూడిలో భూమి నిర్ధారణ, క్షేత్ర పరిశీలన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రైతులతో మాట్లాడారు. రైతులు తమ భూములకు సంబంధించి సరిహద్దులను క్షేత్ర పరిశీలనలో పాల్గొనే సర్వేయర్లకు చూపించి సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

మొవ్వ: స్థానిక క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంబంధించి మొదటి సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు రూ.30 వేలను దాతలు అందజేశారు. ఈ విషయాన్ని ఆ కళాశాల ప్రిన్సిపాల్ కేఏవీఎస్‌వీ ప్రసాద శాస్త్రి సోమవారం విలేకరులకు తెలిపారు. మండవ సత్యనారాయణ సరస్వతీ దంపతులు, వారి కుమార్తె రత్నకుమారి జ్ఞాపకార్థం ప్రవాస భారతీయులు బొప్పన మల్లికార్జునరావు ముగ్గురు విద్యార్థులకు సాయాన్ని అందజేశారు. వడ్లాదిమల్లేశ్వరి, ఏ వీరంకి గాయత్రి, జోగి వెంకట సాయిలకు గ్రామస్తులు మండవ కోటేశ్వరరావు అందజేశారు.



విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేసిన దాతలు

ఉత్తమ సేవలకు పురస్కారం అందజేత



కలెక్టర్ బాలాజీ నుంచి పురస్కారం అందుకుంటున్న పామర్రు తహసీల్దార్ రవికాంత్



పురస్కారంతో పామర్రు ఏఓ శివనాగరాణి



గుడివాడ ఎక్సైజ్ సీఐ వెంకటరమణ

పామర్రు: రిపబ్లిక్ డే దినోత్సవం రోజున మచిలీపట్నంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చేతుల మీదుగా పామర్రు తహసీల్దార్ గూడపాటి రవికాంత్ ఆదివారం ఉత్తమ తహసీల్దార్ అవార్డును అందుకున్నారు. మండల వ్యవసాయాధికారి శివనాగరాణిని ఉత్తమ వ్యవసాయ శాఖ అధికారిగా ఎంపిక చేసి అవార్డును జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అందజేశారు.

ఉత్తమ వీఆర్వోగా కిషోర్

ముదినేపల్లి రూరల్ : మండలంలోని గురజ వీఆర్వోగా పనిచేస్తున్న కాటూరి కిషోర్ ఉత్తమ రెవెన్యూ అధికారి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఏలూరులో ఆదివారం నిర్వహించిన రిపబ్లిక్‌డే వేడుకల్లో కలెక్టర్ వెట్రిసెల్వి నుంచి ఆయన అవార్డు అందుకున్నారు.




కలెక్టర్ వెట్రిసెల్వి నుంచి అవార్డు అందుకుంటున్న గురజ వీఆర్వో కిషోర్

ఎక్సైజ్ సీఐకు సేవా పురస్కారం

గుడివాడరూరల్: గుడివాడ ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలో కలెక్టర్ డీకే బాలాజీ ఉత్తమ అధికారిగా పురస్కారాన్ని అందజేశారు.

విద్యుత్‌శాఖ అధికారులకు అవార్డులు

మండవల్లి: మచిలీపట్నంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో విద్యుత్‌శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ సత్యానందం నుంచి ఆదివారం మండవల్లి అసిస్టెంట్ ఏఈఈ రామకృష్ణ, జేఈ సత్యనారాయణ ఉత్తమ అవార్డులు అందుకున్నారు.



మండవల్లి విద్యుత్‌శాఖ జేఈ సత్యనారాయణ



అవార్డు అందుకుంటున్న ఏఈఈ రామకృష్ణ

వైభవంగా త్యాగరాజస్వామి ఊరేగింపు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లో త్యాగరాజస్వామి ఊరేగింపు సోమవారం వైభవంగా నిర్వహించారు. సింగరాయపాలెం బావాజీ మఠంలోని కోదండరామస్వామి ఆలయంలో నాయీబ్రాహ్మణ, కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన త్యాగరాజస్వామి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారి పూజా కార్యక్రమాలు, సీతారాముల శాంతి కల్యాణం నిర్వహించారు. వృద్ధ కళాకారులకు సన్మానాలు చేయడంతో పాటు నాదస్వర కచేరి నిర్వహించారు.

• **పారిశుద్ధ్యంపై దృష్టి**

గుడ్లవల్లేరు: పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీడీఓ టి.వి జయసారథి తెలిపారు. సోమవారం ఆయన పారిశుద్ధ్య కార్మికులకు ఐదు కొత్త రిక్షాలను అందించారు. గ్రామ కార్యదర్శి ఎ.జె.ఎల్. నరసింహారావు, మాజీ సర్పంచ్ బాలాజీ పాల్గొన్నారు.

• **ఎస్సీ ధ్రువీకరణ పత్రాలను అందించాలి**

గుడ్లవల్లేరు: బైండ్ల కులస్తులకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మను ఆ సంఘ కృష్ణా జిల్లా అధ్యక్షుడు నిడుమోలు పెద్దిరాజు కోరారు. ఈ విషయమై సోమవారం మచిలీపట్నంలో జరిగిన మీకోసంలో వినతి పత్రాన్ని అధికారులకు అందించామని తెలిపారు.